ప్రభుత్వ పాఠశాల పనులు అడ్డగింత


జేసీబీని అడ్డుకుంటున్న శీలం ముత్తక్క

జైపూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిపెల్లి ప్రభుత్వ భూమిలో రూ.50 లక్షలతో నిర్మిస్తున్న ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణ పనులను సోమవారం గ్రామానికి చెందిన శీలం ముత్తక్క, శీలం సుశీలలు ఈ భూమి తమదేనని పనులను అడ్డుకున్నారు. దీంతో మాజీ సర్పంచ్ పాలమాకుల లింగారెడ్డి తహసీల్దార్ కార్యాలయంలో, పోలీస్‌స్టేషన్‌లో వారిపై ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై తహసీల్దార్ వనజారెడ్డిని వివరణ కోరగా విచారణ చేసి నిర్ధారణ చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమి అని తేలితే పనులను అడ్డుకున్న వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మళ్లీ రెవెన్యూ యోగం

- తెరపైకి మళ్లీ వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థ
- పునరుద్ధరించేందుకు సర్కారు అడుగులు
- పరీక్ష నిర్వహించి పోస్టింగ్ ఇచ్చే యోచన
- ఆందోళనలో ఆయా విభాగాల ఉద్యోగులు
- ఇప్పటికే సీనియారిటీ పోయిందని ఆవేదన



మంచిర్యాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో కీలకంగా వ్యవహరించి ప్రతీ ప్రభుత్వ కార్యక్రమాన్ని అన్నీ తామై నడిపించిన వీఆర్వో, వీఆర్ఏల వ్యవస్థను పునరుద్ధరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. గ్రామ స్థాయిలో రెవెన్యూశాఖను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో రేవంత్ సర్కారు తిరిగి వారి సేవలను వినియోగించుకోవాలనే ఆలోచన చేస్తోంది. రెవెన్యూశాఖలో వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థను పునరుద్ధరించడం ద్వారా గ్రామస్థాయి లోని రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాలని ప్రభుత్వం కసరత్తులు చేస్తోంది. ప్రభుత్వం ఆలోచనలను స్వాగతిస్తూ వివిధ శాఖల్లో పనిచేస్తున్న వీఆర్వో, కొందరు వీఆర్ఏలు మాతృ శాఖలో వెళ్లి విధులు నిర్వర్తించుకోవచ్చనే ఉత్సాహంలో ఉన్నారు.

వీఆర్వోల ప్రస్థానం....

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2002లో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఉన్న సమయంలో వీఏవో (విలేజ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్)లకు గ్రామ కార్యదర్శులుగా అదనపు బాధ్యతలు అప్పగించి వేతనం పెంచారు. 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వారిని వీఆర్వో (విలేజ్ రెవెన్యూ ఆఫీసర్)లుగా గుర్తించి గ్రామ రెవెన్యూ బాధ్యతలను అప్పగించారు. అనాటి నుంచి వీఆర్వోలుగా కొనసాగుతూ వస్తున్నారు. 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ధరణిని తీసుకొచ్చింది. ఈ క్రమంలో రెవెన్యూ శాఖలో జరిగిన అనేక మోసాలు, అవినీతిపై కుప్పలు తెప్పలుగా ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో రెవెన్యూశాఖలోని వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థను 2020లో రద్దు చేసింది. వారందరినీ ప్రభుత్వంలోని ఇతర 36 శాఖల్లోకి సర్దుబాటు చేసింది. ఈ విషయంపై వీఆర్వోలు కోర్టుకు వెళ్లగా ఇప్పటికీ తీర్పు రిజర్వులోనే ఉంది.

బదలాయింపుల్లో అన్యాయం

2023 ఆగస్టులో జరిగిన వీఆర్ఏల బదలాయింపుల్లో వారి విద్యార్హతను బట్టి రెవెన్యూతో పాటు మున్సిపాలిటీ, నీటిపారుదల శాఖ కార్యాలయాల్లో జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, అటెండర్గా అవకాశం కల్పించారు. మంచిర్యాల జిల్లాలో 542 మంది వీఆర్ఏలు ఉండగా, ప్రస్తుతం రెవెన్యూ శాఖలో 260 మంది విధులు నిర్వహిస్తున్నారు. మిగతా వారిలో అధిక శాతం మందిని ఇతర శాఖల్లోకి పంపించారు. శాఖల బదలాయింపుల్లో భాగంగా వారంతా జీరో సర్వీసు నుంచి తిరిగి ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించాల్సి వచ్చింది. దీంతో ఇంతకాలం చేసిన

మిగితా..7లో

సర్వీసును పరిగణలోకి తీసుకోవాలి



వీఆర్ఏగా రెవెన్యూశాఖలో 15 యేళ్లుగా ఉద్యోగం చేస్తున్నా. 2020లో మా సహచరులంతా ఇతరశాఖలకు వెళ్లినప్పటికీ నేను మాతృశాఖలోనే ఉండిపోయా. కొన్నేళ్లుగా రెవెన్యూ శాఖలో విధులు నిర్వర్తించిన వీఆర్వోలు అంతా వేరే శాఖల్లో చేరి జీరో సర్వీసుతో కొనసాగుతున్నారు. రెవెన్యూ శాఖలోకి ప్రభుత్వం రీపోస్టింగ్ ఇవ్వాలని నిర్ణయించుకున్నందున ఇంతకాలం చేసిన సర్వీసును పరిగణలోకి తీసుకొని న్యాయం జరిగేలా చూడాలి. అలాగే ఇంటర్ విద్యార్హతలు ఉన్న వాళ్లందరికీ నేరుగా అవకాశం ఇవ్వాలి. లేదంటే సీనియారిటీ ప్రకారం ఇస్తే మేలు జరుగుతుంది.

- సాగె ఓంకార్, రికార్డు అసిస్టెంట్, రెవెన్యూశాఖ

నస్పూర్ గడీకి కొత్త అందాలు

- ఆనాటి పాలకుల గుర్తుకు చిహ్నం...
- గడీకి మెరుగులు దిద్దుతున్న వంశీయులు

7


గదుల ఆధునీకరణ విద్యుత్ లైట్లు

సింగరేణిలో ఆమె

- అన్ని విభాగాల్లోనూ విధులు
- కారుణ్య నియామకాలతో పెరుగుతున్న మహిళలు
- ఉన్నత చదువులు చదివినా వారూ ఎక్కువే

7



న్యూస్ బాక్స్

ఖాదీ గ్రామోద్యోగ మేళా ప్రారంభం

శ్రీరాంపూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సీసీసీ నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయంలో వావిలాల ఖాదీ గ్రామోద్యోగ్ మేళాను జీఎం బి. సంజీవరెడ్డి, సేవా అధ్యక్షురాలు రాధాకుమారి సోమవారం ప్రారంభించారు. జీఎం మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగులకు డిస్కౌంట్లలో ఖాదీ వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. క్రెడిట్ పద్ధతిలో కూడా తీసుకోవచ్చ న్నారు. ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైద డీజీఎం(పర్సనల్) పి. అరవిందరావు, సీనియర్ పీవో కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్

బెల్లంపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత అన్నారు. సోమవారం పట్టణంలోని 13వ వార్డులో రూ. 3 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించి మాట్లాడారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ పట్టణాభివృద్ధికి అన్ని విధాలుగా నిధులు తీసుకువస్తున్నాడని, దీంతో పట్టణం అభివృద్ధి చెందుతుందన్నారు. అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు నిర్మిస్తామని పేర్కొన్నారు. కౌన్సిలర్ బండి ప్రభాకర్, నాయకులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించే వరకు నిరసనలు


మాట్లాడుతున్న అధ్యాపకులు

మంచిర్యాల అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న కళాశాల విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో కళాశాలల పరిస్థితి అధ్వాన్నంగా తయారైందని, బకాయిలను చెల్లించే వరకు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాలు చేపడుతామని ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు అన్నారు. సోమవారం పట్టణంలోని వివేకవర్ధిని డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా స్పందించడం లేదని, దీంతో కళాశాలలను మూసివేసుకునే పరిస్థితి నెలకొందని, బకాయిలను విడుదల చేసేవరకు బంద్ పాటించడంతో పాటు నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు. ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి


కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న శంకర్

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ మోతీలాల్, బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. జైపూర్, బెల్లంపల్లి, దండేపల్లి నుంచి వచ్చిన ప్రజలు దరఖాస్తులు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో 18 దరఖాస్తులు వచ్చాయని ప్రతి దరఖాస్తును పరిశీలించి అధికారుల సమన్వయంతో పరిష్కారం దిశగా కృషి చేస్తామని తెలిపారు. జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

గ్రామ అభివృద్ధి కోసం చేసిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని మాజీ సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు సాపాట్ శంకర్ ప్రజావాణిలో కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి పత్రం అందించారు. రూ.5వేల లోపు ఉన్న ప్రతీ బిల్‌ను పరిగణలోకి తీసుకుని సర్పంచులకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతానని చెప్పినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం నిధుల కేటాయింపు లబ్ధిదారుల ఎంపికలో పీసా చట్టాన్ని పాటిస్తూ ఏజెన్సీ గ్రామాల్లో గ్రామసభల ద్వారానే లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలని ఆదివాసీ సంఘాల నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

కోటపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల సమస్యలపై కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ కలెక్టర్‌కు రాసిన లేఖను సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు మంత్రి రామయ్య ప్రజావాణిలో కలెక్టర్‌కు అందించారు. కలెక్టర్ స్పందించి కేంద్ర మంత్రికి రూ.3 కోట్ల నిధులు మంజూరుకు లెటర్ రాస్తానని, రాష్ట్ర ప్రభుత్వం రూ. 1.20 కోట్లు, కేంద్ర ప్రభుత్వం రూ. 1.80 కోట్ల నిధులు మంజూరైతే మండల కేంద్రంలో వసతి గృహంతో పాటు డబుల్ బెడ్‌రూంలకు కేటాయించనున్నట్లు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ఓంకార్ వర్ధంతిని విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎంసీపీఐయూరాష్ట్ర కార్యదర్శి రవి

బెల్లంపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా మచ్చాపురంలో ఈ నెల 17న జరిగే ఎంసీపీఐయూ వ్యవస్థాపక నేత, మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ వర్ధంతిని విజయవంతం చేయాలని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి పేర్కొన్నారు. సోమవారం బెల్లంపల్లి ఎంసీపీఐయూ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్దికాయల ఓంకార్ 14వ యేటనే భూస్వాముల దోపిడిని అరికట్టడంతోపాటు మహిళలపై జరుగుతున్న దారుణ అకృత్యాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారన్నారు. ఈ నెల 17న ఉదయం 11 గంటలకు మచ్చాపురంలో ఓంకార్ స్థూపం వద్ద జరిగే వర్ధంతి సదస్సుకు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. జిల్లా సహాయకార్యదర్శి పసులేటి వెంకటేష్, నాయకులు కుమారస్వామి, కృష్ణరెడ్డి, సబ్బని రాజేంద్ర ప్రసాద్, శ్రీనివాస్, సతీష్, ఆకాష్,రమేష్ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. సోమ వారం కలెక్టరేట్‌లో సెంటర్‌ఫర్ రూరల్ మేనేజ్‌మెంట్ నేషనల్ లెవెల్ మానిటర్స్ సభ్యులు బాలమురళి, సునీల్, డీఆర్‌డీవో కిషన్, జిల్లా పయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు.

కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. 250 మంది జనాభా కన్నా అధికంగా ఉన్న వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రానికి అనుసంధానమయ్యే బీటీరోడ్లు, మరమ్మతు వివరాలతో నిబంధనలకు లోబడి నివేదిక అందించాలని తెలిపారు. సెంటర్‌ఫర్ రూరల్ మేనేజ్‌మెంట్ నేషనల్ లెవెల్ మానిటర్స్ సభ్యులు ఈ నెల 15 నుంచి 19 వరకు జిల్లాలో ఎంపిక చేసిన పది గ్రామాల్లో పర్యటిస్తారని, అభివృద్ధి పనులను పరిశీలిస్తారని తెలిపారు. సభ్యులు గ్రామాల్లో పర్యటించే సమాచారాన్ని ప్రజలకు ముందుగా తెలియజేయాలని, మండలస్థాయి అధికారులు అందుబాటులో ఉండాలన్నారు.



ఆస్నాద గ్రామంలో జ్వరాలు ప్రబలుతుండడంతో అంగ్రాజ్‌పల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. 152 మందికి పరీక్షలు నిర్వహించారు. 8 మంది జ్వర పీడితుల రక్తనమూనాలను సేకరించి మందులను అందజేశారు. మాజీ జెడ్పీటీసీ బెల్లంకొండ కరుణసాగర్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముత్యాల బాపగౌడ్, వైద్యులు కృష్ణవేణి, హెచ్ఈవో జగదీష్, హరిత, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.
- చెన్నూర్

ఎంఈవోగా పదోన్నతి పొందిన సెడ్మకి రామును సోమవారం దేవాపూర్‌లో ఆదివాసీ నాయకపోడ్ సేవా సంఘం నాయకులు సన్మానించారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి బాపు మాట్లాడుతూ నిరుపేద గిరిజన కుటుంబంలో పుట్టిన రాము ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించడం ఆనందంగా ఉందన్నారు. నాయకులు జనార్దన్, సిడాం శంకర్, రాందాస్, కనక గోవర్దన్, మడావి ధర్మారావు, జగ్గయ్య, కుర్సెంగ మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.
- కాసిపేట



తేనెటీగల దాడి
-50 మందికి పైగా గాయాలు

బెల్లంపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బూడిదగడ్డ బస్తీకి చెందిన ఆడెపు శ్రీనివాస్ అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. బూడిదగడ్డ బస్తీ నుంచి పోచమ్మ చెరువు వరకు మృతదేహాన్ని బంధువులు, స్నేహితులు తీసుకువెళ్తుండగా ఎంపీడీవో కార్యాలయం వద్దకు రాగానే తేనెటీగలు దాడిచేశాయి. అంతిమ యాత్రలో పాల్గొన్న కుటుంబీకులు, స్నేహితులు మృతదేహాన్ని రోడ్డు పక్కన పెట్టి పరుగులు తీశారు. ఈ క్రమంలో తేనెటీగలు దాడి చేయడంతో 50 మందికి పైగా గాయాలయ్యాయి. దాదాపు 2 గంటల పాటు తేనెటీగలు సమీప ప్రాంతంలోనే ఉండడంతో మృతదేహం వద్దకు ఎవరూ వెళ్లలేకపోయారు. అనంతరం మృతదేహాన్ని శ్మశాన వాటికకు తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. గాయాలపాలైన వారు వైద్యం చేయించుకున్నారు.

ఉద్యోగాల పేరుతో మోసం

కాసిపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యాంజలి పోర్టల్‌లోని సబ్ ఏజెన్సీ గ్లోబల్ ఫౌండేషన్ ద్వారా మండల కేంద్రానికి చెందిన నలుగురు యువతీ యువకులకు జిల్లా పరిషత్ పాఠశాలలో అటెండర్, కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలను ఇస్తూ ఈ నెల 10న నియామక పత్రాలు అందించారు. నియామక పత్రాలు ఇచ్చేటప్పుడు రూ.30 వేలు వసూలు చేశారు. విధుల్లో చేరిన తర్వాత రూ.2 లక్షలు ఇవ్వాలని ఒప్పందం చేసుకున్నారు. దసరా సెలవుల అనంతరం ఉద్యోగాల్లో చేరాలని నియామక పత్రాలు అందించారు. రెండు రోజుల క్రితం ప్రధానోపాధ్యాయుడు సాంబమూర్తిని సంప్రదించగా ఉద్యోగాలు లేవని చెప్పడంతో యువతీ, యువకులు మోసపోయామని గుర్తించారు. ఎంఈవో వెంకటేశ్వర్లను వివరణ కోరగా నియామక పత్రాలతో కొందరు పాఠశాలకు వస్తున్నారు, మాకు అధికారికంగా ఎలాంటి ఆదేశాలు లేవని తెలిపారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి నిధులు మంజూరు

మంచిర్యాల, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం తాళ్లపేటలో ఏర్పాటు కానున్న 132/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి రూ. 26.27 కోట్లు విడుదల చేస్తూ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ సీఎండీ రొనాల్డ్ రాస్ సోమవారం రాత్రి పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

లాభాల బాటలో కూరగాయల రైతులు

● తక్కువ విస్తీర్ణంలో అధిక పంటలు ● సీజనల్ తోటల పెంపకం

రెబ్బెన, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కూరగాయల సాగు రైతులకు లాభాలు తెచ్చి పెడుతోంది. బతుకుబండిని లాగటానికి ఉపాధికోసం పట్టణాలపై వైపు చూడాల్సిన అవసరం లేకుండా చేస్తోంది. గంగాపూర్, కొండపల్లి, నేర్పల్లి రైతులు కూరగాయలు సాగు చేసి చక్కటి లాభాలను ఆర్జిస్తున్నారు. తక్కువవిస్తీర్ణంలో కూరగాయలు పండిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. పండించిన పంటల ఉత్పత్తులను స్థానికమార్కెట్‌లోనే విక్రయిస్తున్నారు. మరికొంత మంది ఏకంగా ఇతర ప్రాంతాల్లోకి వెళ్లి విక్రయించి లాభాలను సొమ్ము చేసుకుంటున్నారు.

తక్కువ విస్తీర్ణంలో..

మండలంలోని గంగాపూర్, కొండపల్లి, నేర్పల్లి ప్రాంతాల్లోని రైతులు కూరగాయలు సాగు చేసేందుకు అందుబాటులో ఉండే వాగులపైనే ఆధారపడుతున్నారు. గంగాపూర్ గ్రామానికి ఆనుకుని గంగాపూర్ వాగు, కొండపల్లి, నేర్పెల్లి ప్రాంతాల్లో ప్రవహించే కొండపల్లి వాగు నీటితోనే కూరగాయాలను పండిస్తున్నారు. ప్రధాన నీటి వనరులను ఉపయోగించుకొని కూరగాయలను పండిస్తున్నారు. తక్కువవిసీర్ణంలో ఎక్కువ రకాల పంటలను పండిస్తున్నారు. మోటార్ల ద్వారా నీటిని పంటపొలాలకు మళ్లించి కూరగాయలను పండిస్తున్నారు. ప్రణాళికబద్ధంగా సీజనల్ వారీగా కూరగాయలను పండించాలన్న అంశంపై స్పష్టమైన అవగాహన పెంచుకొని సాగు చేసి ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ముఖ్యంగా మిర్చి, టమాట, క్యాబేజీ, చిక్కుడు, వంకాయ, బెండ, క్యాలీఫ్లవర్, ముల్లంగివంటి కూరగాయాలు సాగు చేస్తున్నారు. వీటితో పాటు తీగజాతుల్లో బీర, కాకర, సోర, పొట్ల, బుడమకాయలను సాగు చేస్తున్నారు. వీటితోపాటు తోటకూర, పాలకూర, బచ్చలికూర, కరివేపాకుపండిస్తున్నారు. నీటివనరులను ఉపయోగించిపంటలను పండించటమే కాకుండారసాయనిక ఎరువులను వాడకం తగ్గించి సేంద్రియపద్ధతిలో పంటదిగుబడులు చేస్తున్నారు. పంటలదిగుబడిరాగానే రైతులే నేరుగా మార్కెట్‌కు వెళ్లి విక్రయిస్తున్నారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, మంచిర్యాల, బెల్లంపల్లి, పెద్దపల్లి, గోదావరిఖని, చంద్రాపూర్, బల్లార్షా ప్రాంతాలకు కూడా తరస్తున్నారు.



గంగాపూర్‌లో కూరగాయల చేను(ఫైల్)

తక్కువ సమయంలో..
-అరుణ్, రైతు, గంగాపూర్



కూరగాయల సాగు తక్కువ కాలంలోనే చేతికి వస్తుంది. వరి, జొన్న, పత్తి పంటలతో పోల్చుకుంటే రెండు మూడు సార్లు పంటను తీసుకోవచ్చు. కూరగాయలు సాగుతో చేతిలో ఎప్పుడూ ఖర్చులకు డబ్బులు ఉంటున్నాయి. కూరగాయాలు తెంపడానికి కూడా కూలీలు సమస్య ఉండదు. మార్కెట్‌లో ఉండే కూరగాయాల డిమాండును బట్టి పంటలను పండిస్తున్నాం. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తుండడంతో తాము పండించిన పంటలకు అధిక డిమాండు ఉంది.

నేడు డీఎస్సీ అభ్యర్థులకు పోస్టింగ్ కౌన్సెలింగ్

ఆసిఫాబాద్ రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో డీఎస్సీ- 2024లో ఎంపికై నియామక ఉత్తర్వులు అందుకున్న అభ్యర్థులకు ఈ నెల 15న పోస్టింగ్ కొరకు కౌన్సిలింగ్ నిర్వహిస్తామని డీఈవో యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉదయం 10గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని అభ్యర్థులు తమవెంట నియామక ఉత్తర్వులు, రెండుఫోటోలు, ర్యాంకుకార్డుతో సకాలంలో హాజరు కావాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్‌ఎంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికుల, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులువినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకుడు చిరంజీవి మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల వేతనాల పెంపునకు కమిటీ వేసి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం పది నెలలు అవుతున్నా పరిష్కరించడం లేదన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ఈనెల16న జిల్లాకేంద్రంలో మహాధర్నా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలోఆసంఘంనాయకుల రాందాస్,గణేష్, శ్రేష్మతదితరులు పాల్గొన్నారు.

యువతికి సన్మానం

కెరమెరి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌపన్‌గూడ గ్రామానికి చెందిన పంద్రం శోభ ఇటీవల డీఎస్సీఫలితాల్లో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించడంతో సోమవారం మాజీఎమ్మెల్యే ఆత్రంసక్కు యువతిని సన్మానించారు. చైతన్య యువజనసంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో మాజీఎంపీపీ మోతీరాం, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, కుసుంరావు, నానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో జాతీయస్థాయి బృందం పర్యటన



చేపల పెంపకాన్ని పరిశీలిస్తున్న సభ్యులు

కాగజ్‌నగర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలంలోని దుర్గానగర్, వల్లకొండ, కోసిని గ్రామంలో ఉపాధిహామీ జాతీయస్థాయి బృందాలు పర్యటించాయి. ఈ సందర్భంగా ఉపాధిహామీ పనుల్లో చేసిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే చేపలపెంపకం, కుంట పనిని పరిశీలించారు. ఈ బృందం సభ్యుల్లో నాగరాజు, రఘునాథ్‌తో పాటు ఎంపీడీవో రమేష్, ఏపీవో బుచ్చన్న, ఎంపీఎం భూమక్క తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధర్మచక్ర పరివర్తన దివస్

వాంకిడి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖమాన గ్రామంలో సోమవారం 68వ ధర్మచక్రపరివర్తన దినోత్సవంను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బౌద్ధసమాజ్ అధ్యక్షుడు శేఖర్, ఉపాధ్యక్షుడు తిరుపతి, ఉపాసకులు మిలింద్‌కుమార్, కిషన్, మారుతి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బాలికపై అత్యాచారం

జైపూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామంలో బాలిక (6)పై అదే గ్రామానికి చెందిన సంక మల్లయ్య (50) అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆదివారం మల్లయ్య ఇంటి సమీపంలో బాలిక ఆడుకుంటుండగా ఇంట్లోకి తీసుకువెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక ఏడుస్తూ ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులకు తెలపడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. మల్లయ్య భార్య మృతి చెందగా కొడుకు, కోడలు వద్ద ఉంటున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మల్లయ్య బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ శ్రీధర్ తెలిపారు. బాలికను చికిత్స నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

దుర్గామాత శోభాయాత్రలో అపశ్రుతి
వాహనం ఢీకొని యువకుడు మృతి



గోమాస నందు (ఫైల్)

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 14: మంచిర్యాల పట్టణంలో ఆదివారం రాత్రి జరిగిన దుర్గామాత శోభాయాత్రలో అపశ్రుతి చోటు చేసుకుంది. సీసీసీ నస్పూర్ ఫ్లడ్ కాలనీకి చెందిన గోమాస నందు (18) మృతి చెందాడు. నందు అతడి సోదరితో కలిసి రెడ్డికాలనీలో నిర్వహించిన శోభాయాత్రలో పాల్గొనేందుకు వచ్చాడు. జనరేటర్ స్టార్ట్ చేసేందుకు గంప సాకేత్‌తో కలిసి ప్రయత్నిస్తుండగా అతి వేగంతో వచ్చిన బొలేరో వాహనం వారిద్దరిని ఢీకొంది. సాకేత్‌కు స్వల్ప గాయాలు కాగా నందుకు తీవ్రగాయాలయ్యాయి. నందును కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి సోదరి నవీనారాణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సనత్ రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మునిందర్ (ఫైల్)

నస్పూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ గేట్ సమీపంలోని పెట్రోల్ బంక్ ఎదురుగా సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమా దంలో మందపల్లి మునిందర్ (55) అక్కడిక్కడే మృతి చెందాడు. సెలూన్ షాప్ నిర్వహించే మునిందర్ ఫ్లడ్‌కాలనీ నుంచి పెట్రోల్ బంక్ వైపు రోడ్డు దాటుతుండగా మంచిర్యాల వైపు వెళుతున్న లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య హేమలత, కూతురు దీప్తి ఉన్నారు. భార్య పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నమని ఎస్సై సుగుణాకర్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

కన్నెపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భీమిని గ్రామానికి చెందిన జంగపల్లి రాకేష్ (35) మండల కేంద్రంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న రాకేష్ మద్యానికి బానిసై భార్యను వేదిస్తున్నాడు. దీంతో పది రోజుల క్రితం భార్య పుట్టింటికి వచ్చింది. రాకేష్ ఆదివారం అత్తగారింటికి వచ్చి ఇంటికి రావాలని కోరగా నిరాకరించింది. మనస్తాపంతో కన్నెపల్లిలోని వైన్ షాపు పక్కన మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. స్థానికులు గమనించి బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి సోదరుడు చంద్రయ్య ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గంగారాం తెలిపారు. రాకేష్‌కు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

డ్రైనేజీలో పడి వ్యక్తి మృతి

మందమర్రిటౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ కాలనీకి చెందిన మార్త కుమారస్వామి (53) మేస్త్రీ ఆదివారం రాత్రి ఇంటి సమీపంలోని డ్రైనేజీలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. సోమవారం ఉదయం స్థానికులు చూసే సరికి మృతి చెంది ఉండడంతో హైదరాబాద్‌లో ఉంటున్న కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం అందించారు. సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్‌ఐ రాజశేఖర్‌లు మృతదేహాన్ని పరిశీ లించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కులం పేరుతో దూషించిన ఇద్దరిపై కేసు

నెన్నెల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గొళ్లపల్లి గ్రామానికి చెందిన దళితుడు పొన్నాల వెంకటస్వామిని కులం పేరిట దూషించిన తండ్రీకొడుకు వేల్పుల రాజం, సతీష్‌పై సోమవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై ప్రసాద్ తెలిపారు. తన భూమిలో వాంతి చేసుకున్నావంటూ వెంటస్వామిని రాజం దుర్భాషలాడుతూ కర్రతో కొట్టాడని చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

పర్సు అందజేత

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 14 : పట్టణంలోని ఓ హోటల్‌లో సోమవారం ఓ మహిళ పర్సును పోగొట్టుకోగా పోలీసులు తిరిగి అందజేశారు. హోటల్ యజమాని సహాయంతో బ్లూకోల్ట్ సిబ్బంది లక్ష్మణ్, రాజ్‌కుమార్‌లు పర్సును గుర్తించగా రూ.10వేల వరకు నగదు ఉందని, ఆ మహిళ ఆచూకీని గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి అందజేశామని పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు.

దాడి కేసులో 14మందికి రిమాండు

కాగజ్‌నగర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లో ఫ్రూట్ జ్యూస్ సెంటర్ ధ్వంసం కేసులో 14మందిని రిమాండుకు తరలించినట్టు డీఎస్పీ రామానుజం తెలిపారు. జ్యూస్ సెంటర్ వద్ద గొడవ జరుగగా దాడిచేసిన 14 మందిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్టు వివరించారు.

పంట చేనులో పైపుల దొంగతనం

కెరమెరి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గోయగాం గ్రామానికి చెందిన రైతులు సత్తయ్య, జానకీరాం, ముకుంద్‌రావు పొలాల్లో ఉన్న పైపులు ఆదివారం రాత్రి దొంగలు ఎత్తుకుపోయారు. సత్తయ్య, జానకీరాంకు చెందిన 40పైపులు, ముకుంద్‌రావుకు చెందిన సోలార్ పంపు సెట్టు దొంగలించి ఆసిఫాబాద్ వైపు బొలేరో వాహనంలో తరలించినట్లు సీసీ ఫుటేజ్‌లలో రికార్డు అయింది. ఈ మేరకు బాధితులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

భూవివాదంలో దాడికి యత్నించిన ఒకరి అరెస్టు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 14: భూవివాదంలో దాడికి యత్నించిన కుంట శ్రీనివాస్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఏసీపీ ఆర్.ప్రకాష్ తెలిపారు. సోమవారం ఆయన కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన పోతిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జైపూర్ మండలం రసూల్‌పల్లికి చెందిన కోమటి సత్తయ్య, హమాలీవాడకు చెందిన సోంశెట్టి సంపత్‌లు భూమిని కొనుగోలు చేసి ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేశారు. మంథని మండలం గుంజపడుగుకు చెందిన కుంట శ్రీనివాస్ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నం చేశాడు. ఈ నెల 10న సుధాకర్ రెడ్డి అతని పార్ట్‌నర్స్ భూమి వద్దకు వచ్చాడని తెలుకున్న శ్రీనివాస్ తల్వార్‌తో సుధాకర్ రెడ్డిని హత్య చేసేందుకు ప్రయత్నించగా వారు పారిపోయారు. శ్రీనివాస్ గట్టు వామన్‌రావు దంపతులను హత్య చేసిన ఘటనలో ఏ-1 నిందితుడని, అతనిపై ఇప్పటివరకు 5 కేసులు ఉన్నాయని ఏసీపీ తెలిపారు. అతన్ని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పర్చినట్లు ఏసీపీ తెలిపారు. పట్టణ సీఐ బన్సీలాల్, ఎస్సై సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

చేతి వృత్తులను కాపాడేందుకు కృషి : ఎంపీ గోడం నగేష్



కాగజ్‌నగర్‌లో మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేష్

కాగజ్‌నగర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): చేతి వృత్తులను కాపాడేందుకు కృషి చేస్తామని ఎంపీ గోడం నగేష్ అన్నారు. సోమవారం కాగజ్‌నగర్ పద్మశాలిసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆలయ్ బలయ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పద్మశాలి కులస్థుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే హరీష్‌బాబు మాట్లాడుతూ పద్మశాలి కులస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికితీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. బీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం చేనేతరంగం ఆర్థికంగా ఎంతో వెనుకబడి ఉందన్నారు. చేనేత కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సమావేశంలో పద్మశాలిసంఘం అధ్యక్షుడు కుడిక్యాల రాజమౌళి, జిల్లా అధ్యక్షుడు సామల రాజన్న, బీజేపీ రాష్ట్రకార్యవర్గసభ్యుడు కొంగ సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు సిందంశ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లకనకయ్య, గడదాసు మల్లయ్య, పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి..

పెంచికలపేట: పార్టీబలోపేతానికి ప్రతీకార్యకర్త కృషిచేయాలని ఎంపీ గోడం నగేష్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబుతో కలిసి ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తలకు ఎల్లవేళ్లలా అండగా ఉంటానని అన్నారు. ప్రభుత్వంనుంచి అందే ప్రతిపథకం కార్యకర్తల ద్వారానే ప్రజలకు చేరుతుందని, ఎవరూ అధైర్యపడొద్దని అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదుకార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరంపలు సమస్యలపై ఎంపీ,ఎమ్మెల్యేలకు కార్యకర్తలు విన్నవించారు. అంతకుముందు ఎంపీ,ఎమ్మెల్యేలను మాజీసర్పంచ్ కావ్యనాగన్న దంపతులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌రావు, శ్రీశైలం, మధుకర్, నాగన్న,సత్యనారాయణ,మహేష్,పురుషోత్తం,కాంతారావు పాల్గొన్నారు.

బీజేపీతోనే నీతివంతమైన పాలన..

బెజ్జూరు: బీజేపీతో నీతివంతమైన పాలన అందుతుందని ఎంపీ గోడం నగేష్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలో పార్టీ సభ్యత్వ నమోదును ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని బూత్‌లలో కార్యకర్తలు సభ్యత్వ నమోదు వేగాన్ని పెంచాలని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే హరీష్‌బాబు బాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వ నమోదును 25వేలకు పెంచాలన్నారు. కొన్ని యూట్యూబ్ చానళ్లలో తాను అందుబాటులో ఉండడం లేదని ప్రచారం చేస్తున్నారని వారి పై చట్టరీత్యా చర్యలు తీసుకుంటానని అన్నారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేలను ఆదివాసీ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావు, సుధాకర్, శంకర్, బాలకృష్ణ, రామయ్య, వసీఖాన్, రాజారాం, బాపు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన పద్మశాలి కులస్థులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌటాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కౌటాల సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ రాజేశ్వర్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గుండాయిపేట, తలోడి, చీపురుదుబ్బ, బోధన్‌పల్లి, ముత్యంపేట, గుడ్లబోరి, వీర్దండి, మొగడ్‌దగడ్ గ్రామాలతోపాటు చింతలమానేపల్లి మండలంలోని చింతలమానేపల్లి, రవీంద్రనగర్, బాబాసాగర్, రన్‌వెల్లి, డబ్బా, అనుకోడ గ్రామాల్లో విద్యుత్‌సరఫరా నిలిపివేస్తామని వినియోగదారులు గమనించి సహరించాలని కోరారు.

పార్కులైన్‌లో అన్నదానం

కాగజ్‌నగర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పార్కులైన్‌లోని శ్రీ దుర్గామాత మండపం వద్ద సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గామాత వద్ద పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

పెంచికలపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి):: మండలంలోని నందిగాం నుంచి ఆగర్‌గూడ వరకు రోడ్డుపై ఉన్న గుంతలను కాంగ్రెస్‌పార్టీ నాయకులు పూడ్చి వేయించారు. ఇటీవల ఎమ్మెల్సీ దండెవిఠల్ దృష్టికి మండల నాయకులు ఈ విషయాన్ని తీసుకుపోగా వెంటనే స్పందించిన ఆయన తననిధుల నుంచి మరమ్మతులు చేయిస్తున్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, శంకర్‌గౌడ్, రాజన్న, ఇలియాస్, మధునయ్య, బాపు, చందు తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేట్ జీఎంకు ఘన సన్మానం



జీఎంను సన్మానిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ జనరల్ మేనేజర్(సీపీపీ)గా ఇటీవల బాధ్యతలు చేపట్టి ఎ మనోహర్‌ను శ్రీరాంపూర్ జీఎం బి సంజీవరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. సోమవారం ఆయన శ్రీరాంపూర్‌కు రాగా, ఆయ నను సన్మానించి మాట్లాడారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతలో మనోహర్ ఎంతో అనుభవం కలిగిన వ్యక్తి అని కొనియాడారు. దూరదృష్టితో పనిచేసే వ్యక్తిఅని తెలిపారు. కార్యక్ర మంలో శ్రీరాంపూర్, ఇందారం పీవోలు శ్రీనివాస్, ఏవీరెడ్డి, ఏజెంట్లు గోపాల్‌సింగ్, రాముడు, శ్రీధర్, డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు, ఏరియారక్షణాధికారి శ్రీధర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికి స్కిల్ డెవలప్‌మెంట్



మాట్లాడుతున్న జీఎం దేవేందర్

మందమర్రిటౌన్, అక్టోబరు 14 (ఆంధ్ర జ్యోతి): కోల్‌బెల్ట్ ప్రాంతంలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని మందమర్రి జీఎం దేవేందర్ తెలిపారు. సోమవారం పట్టణంలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో కంప్యూటర్ డీటీపీకోర్సులను ప్రారంభించి మాట్లాడారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం కోసం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సబులిటీతోపాటు సామాజికబాధ్యతగా ఈ కార్యక్రమాన్ని సింగరేణి చేపట్టిందన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలు పొందాలన్నారు. రీజనల్‌డైరెక్టర్ ఆఫ్‌స్కిల్‌డెవలప్‌మెంట్ ఎంట్రీప్రినుయరెన్స్ (ఆర్‌డీఎస్‌డీఈ) సంస్థతో ఈశిక్షణ అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి,ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచీ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

రిటైర్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

శ్రీరాంపూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సింగరేణి రిటైర్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోల్‌పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి మారేపల్లి బాబురావు కోరారు. వరంగల్‌కు వచ్చిన కేంద్రబొగ్గు గనులశాఖ మంత్రి జి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందించి తమ సమస్యలు ఏకరువు పెట్టారు. 27ఏళ్లుగా పెన్షన్ పెరగడం లేదని, సీఎంపీఎఫ్ ట్రస్ట్‌బోర్డు తీసుకునే నిర్ణయాలు అమలు చేయడం లేదని, అపరిమిత ఉచిత వైద్యసౌకర్యాలు కేంద్రప్రభుత్వం ద్వారా అందించాలని తదితర డిమాండ్లు నెరవేర్చాలని కోరారు.

వినతిపత్రం ఇచ్చిన వారిలో సారంగాచారి, ప్రకాష్ చారి, ఎస్ ప్రభాకర్, వి చంద్రశేఖర్, మాధవరావు, తదితరులు ఉన్నారు.

సింగరేణి ఆస్పత్రుల్లో మెరుగైన సౌకర్యాలు

శ్రీరాంపూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆస్పత్రుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఆర్కే8 డిస్పెన్సరీలో నిర్మించిన కారు షెడ్డును ప్రారంభించి మాట్లాడారు. డిస్పెన్సరీలకు కావాల్సిన పరికరాలు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం ఎన్‌సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, ఏజీఎం (ఫైనాన్స్) మురళీధర్, డిప్యూటీ సీఎంవో డాక్టర్ పి రమేష్‌బాబు, వైద్యులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్ఎస్‌వో

శ్రీరాంపూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ సీనియర్ సెక్యూరిటీ అధికారిగా జక్కారెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఎస్ఎస్‌వోగా పనిచేసిన మురళీమోహన్ బదిలీపై భూపాలపల్లి ఏరియాకు బదిలీపై వెళ్లారు. ఆయనస్థానంలో టింబర్ యార్డులో పనిచేస్తున్న జక్కారెడ్డి ఎస్ఎస్‌వోగా బాధ్యతలు స్వీకరించారు. వీరిని సెక్యూరిటీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్లు పోగుల స్వామి, రామిరెడ్డి, జూనియర్ ఇన్‌స్పెక్టర్ సిర్ర రాజయ్య, జమ్మేదార్లు తదితరులు పాల్గొన్నారు.



దండేపల్లి మండలం కోర్విచెల్మ గ్రామానికి చెందిన ముగ్గురు ఎస్జీటీ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన రాందేని వినోద్‌కుమార్, బీస అనుష, సామ సుప్రియలను సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో రెబెల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. యూత్ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు. - దండేపల్లి

దసరా ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత శోభాయాత్రను ముల్కల్లలో సోమవారం నిర్వహించారు. రథాలను అలంకరించి అమ్మవారిని వాడవాడలా పాటలతో డప్పు చప్పుళ్లతో మహిళల కోలాటాలతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. ముల్కల్ల విజయ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భీమారం మండల కేంద్రంలో మాజీ సర్పంచు గద్దె రాంరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం దుర్గమాతకు పూజలు నిర్వహించారు. శోభాయాత్ర నిర్వహించి చెరువులో నిమజ్జనం చేశారు. నిరంజన్‌రెడ్డి, విజయ సింహారెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు. - హాజీపూర్, భీమారం





చేతుల శుభ్రతతో వ్యాధులు దూరం

పాఠశాలల్లో అవగాహన కరువు

నేడు హ్యాండ్ వాషింగ్ డే

బెల్లంపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పరిశుభ్రతతోనే పలు వ్యాధులు దరి చేరకుండా నివారించవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు. గత కొన్నేండ్ల క్రితం కరోనా మహమ్మారితో వ్యక్తిగత పరిశుభ్రతపై అందరికి అవగాహన వచ్చింది. చేతులతో పలు రకాల వస్తువులను తాకుతుండడంతో బ్యాక్టీరియా, వైరస్‌లు, కంటికి కనిపించని సూక్ష్మ జీవులు చేతులకు అంటుకుంటాయి. కొవిడ్ తర్వాత ప్రజలకు వ్యక్తిగత ఆరోగ్యంపై పూర్తిస్థాయిలో అవగాహన రావడంతో ఇందుకు తగిన విధంగా మార్కెట్‌లోకి పలు రకాల హ్యాండ్ వాష్‌లు అందుబాటులోకి వస్తున్నాయి. వివిధ రకాల లిక్విడ్‌లు, హ్యాండ్ వాష్‌లు నిత్య జీవితంలో సర్వసాధారణ మయ్యాయి. చేతులు శుభ్రం చేసుకోవడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చనే ఉద్దేశ్యంతో ఐక్యరాజ్య సమితి 2008 నుంచి ప్రతి సంవత్సరం అక్టోబరు 15న అంతర్జాతీయ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించింది.

పాఠశాలల్లో అవగాహన కరువు

చేతుల పరిశుభ్రతతోనే ఎన్నో వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు చేతులను శుభ్రం చేసుకోవడం లేదు. పాఠశాలల్లో విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తే విద్యార్థుల్లో మార్పు వస్తుంది. చేతులు కడుక్కునే సమయంలో విద్యార్థులకు హ్యాండ్‌వాష్, లిక్విడ్‌లను అందుబాటులో ఉంచితే మార్పు తీసుకురావచ్చు.

చేతుల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

రవి, ప్రభుత్వ వైద్యుడు, బెల్లంపల్లి



చేతులు పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎన్నో రకాల వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. భోజనం చేసే ముందు ప్రతీ ఒక్కరు చేతులను రెండు నిమిషాల పాటు వేళ్ల మధ్యలో మంచిగా శుభ్రపర్చుకోవాలి. చేతికి ఉండే గోళ్లను సైతం కత్తిరించుకోవాలి. గోళ్లలో మట్టి, మలినాలు చేరి వీటి ద్వారా హానికర క్రిములు కడుపులోకి వెళ్లి వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుంది. పిల్లలకు చిన్నప్పటి నుంచే చేతుల శుభ్రతపై అవగాహన కల్పించాలి.






నస్పూర్ గడీ కొత్త రూపం

నస్పూర్ గడీకి కొత్త అందాలు

● ఆనాటి పాలకుల గుర్తుకు చిహ్నం.. ● గడీకి మెరుగులు దిద్దుతున్న వంశీయులు

శతాబ్దానికి పైగా చరిత్ర కలిగిన నస్పూర్ గడీ కొత్త అందాలు సంతరించుకుంటోంది. సుమారు 120 ఏళ్ళ కిందట ఈ గడీ నిర్మించారు. చాలా ఏళ్ళుగా నిరుపయోగంగా ఉండడంతో గడీ శిథిలావస్థకు చేరింది. నాటి వారసత్వ సంపదను కాపాడుకోవాలనే ఉద్దేశ్యంతో ఇన్నాళ్ళు నిరుపయోగంగా ఉన్న గడీకి గోనె వంశీయులు మరమ్మతు చేయిస్తున్నారు. డంగు సున్నంతో నిర్మించి గడీకి రంగులు వేసి అందంగా తీర్చిదిద్దుతున్నారు. గడీ విశేషాలు... నాటి సంస్థాన పాలనపై ప్రత్యేక కథనం...

నస్పూర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : శతాబ్దానికి పైగా చరిత్ర కలిగిన పురాతన భవనం... చారిత్రాత్మకమైన కట్టడం... ఆనాటి పాలనకు సాక్ష్యంగా నిలిచిన నస్పూర్ గడీ... దాదాపు 120 ఏళ్ళ కిందట గోనె వంశీయులు డంగు సున్నంతోనే నిర్మించారు. అప్పటి నుంచి గడీ కేంద్రంగా సంస్థాన పాలన ప్రారంభమైంది. అలనాటి కట్టడాల రూపాలు... ఏలిన సంస్థానాధీశులు... నేటి పరిపాలన వరకు నస్పూర్‌కు విశిష్టమైన గౌరవం దక్కింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత జీవీ వంశీయులు రాజకీయాల్లోకి వెళ్ళారు. అనంతరం వారు వివిధ ప్రాంతాల్లో స్థిరపడడంతో గడీ నిరుపయోగం మారి శిథిలావస్థకు చేరింది. వారసత్వ సంపదను కాపాడుకోవాలనే ఉద్దేశ్యంతో ఇన్నాళ్ళు నిరుపయోగంగా ఉన్న గడీకి మరమ్మతు చేయడానికి గోనె వెంకట అంశుమన్ రావు నిర్ణయించారు. దీంతో గతేడాది ఆగస్టులో మరమ్మతు పనులను హైదరాబాద్‌కు చెందిన హెరిటేజ్ మ్యాటర్స్ కంపెనీకి అప్పగించారు.



వెనుక వైపున ఆర్చీలు

కొత్త అందాలను సంతరించుకున్న గడీ..

పాతబడిన గడీని మరమ్మతు చేయడంతో కొత్త అందాలు సంతరించుకుంది. హైదరాబాద్‌లో స్థిరపడిన వారసులు గ్రామంలో పూజారి విఠల్ ద్వారా పనులు చేయిస్తున్నారు. వారసత్వంగా వచ్చిన అపురూప మైన కట్టడ సంపద కాపాడుకోవాలని నిర్ణయించి మైసూర్ ప్యాలెస్ మరమ్మతు చేసే ప్రత్యేక కూలీలు పనులు చేస్తున్నారు. ఇన్నాళ్లుగా పాతబడి శిథిలంగా మిగిలిన గడీ రూపం కూలీలు మెరుగులు దిద్దడం తో కొత్త రూపుతో ఆకర్షణీయంగా తయారవుతోంది.

విశాలమైన గదులు...

నస్పూర్ గడీ నిర్మాణం రెండు అంతస్తులు. కింద పైన విశాలమైన, విలాసవంతమైన గదులు ఉన్నాయి. తలుపులు, కిటికీలు, పైన స్లాబ్‌కు టేకు కలపను వినియోగించారు. ఆకర్షణీయమైన ద్వారాలు, ఆర్చీలు-20, బెడ్ రూం-3, హాల్స్-2 డైనింగ్ హాల్, రీడింగ్ రూం, వంట గది, దేవుడి గది, పై అంతస్తుకు వెళ్లడానికి మెట్లు, తదితర నిర్మాణాలు ప్యాలెస్‌ను తలదన్నే విధంగా ఉన్నాయి. ఈ కట్టడం నాటి కూలీల కళా నైపుణ్యతకు అందం పడుతోంది. గడీ, చుట్టూ ప్రహరి నిర్మాణంలో సిమెంట్ వాడకుండా డంగు సున్నం తోనే నిర్మించారు. వర్షాలు, వరదలు వచ్చిన చెక్కు చెదరకుండా ఆనాటి కట్టడాలకు నిదర్శంగా నిలుస్తోంది. పాతకాలం నాటి భవనాలను కాపాడుకోవాలనే ఉద్దేశ్యంతో మరమ్మతు లను ప్రత్యేక కూలీలతో చేపట్టారు. పురాతన కట్టడాన్ని పదిలంగా ఉంచాలనే ఉదేశ్యంతో జీవీ వంశీయులు గడీకి కొత్త రూపు తెస్తున్నారు. దాదాపు ఐదు ఎకరాలకుపైగా విస్తీర్ణం చుట్టూ ప్రహరి, ఒక వైపున గడీ నిర్మించి ఉంది. ప్రస్తుతం ఆధునీకరణతో గడీ కొత్త మెరుగులు దిద్దుకుంటుంది.



నస్పూర్ గడీ (ఫైల్)

పాత గోడలకు కొత్త అందాలు...

గడీ ఆధునికీకరణ పనులను హైదరాబాద్‌కు చెందిన హెరిటేజ్ కంపెనీ చేపట్టింది. సంస్థ ఇప్పటి వరకు పురాతన కట్టడాలకు మరమ్మతు చేస్తుంది. ఇందులో భాగంగా నస్పూర్ గడీ పనులు కూడా యజమాని గోనె వెంకట అంశుమన్ రావు ఈ సంస్థకు అప్పగించారు. ఒప్పందం ప్రకారం గతేడాది ఆగస్టులో పనులు ప్రారంభించి సెప్టెంబరులో ముగించారు. నిర్మాణంలో ఇసుక, బెల్లం



ఆర్చీకి రూపుదిద్దుతున్న కూలీ

ముడి పదార్థాలను వినియోగించి అందంగా తీర్చిదిద్దారు. 60 మంది కూలీలతో పనులు పూర్తి చేశామని హెరిటేజ్ కంపెనీ సీనియర్ ఇంజనీర్ అరవింద్ కుమార్ తెలిపారు. తమ కంపెనీ రాజ్‌భవన్, బ్రిటిష్ రెసిడెన్సీ, బన్సీలాల్ పేట, రాష్ట్రపతి భవన్‌ల అధునీకరణ పనులు చేపట్టిందన్నారు. ఇక్కడ వాడిన విద్యుత్ స్విచ్‌లు (పాత కాలం నాటి) ఢిల్లీ నుంచి తెప్పించామని, మిగిలిన ముడిసరుకు హైదరబాద్, స్థానికంగా కొనుగోలు చేశామన్నారు.



పాత కాలం నాటి కరెంట్ స్విచ్‌లు

నస్పూర్ కేంద్రంగా సంస్థాన పాలన....

1905 ప్రాంతంలో నస్పూర్ కేంద్రంగా సంస్థాన పాలన మొదలైంది. సంస్థానాధీశులు, జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు, పాండ్యాలు సంస్థానం ద్వారా రాజ్య పాలన నడిచేది. నిజాం రాష్ట్ర ఆధీనంలో ఈ సంస్థానాలు ఉండగా, అందులో నస్పూర్ ప్రధాన సంస్థానంగా లక్షెట్టిపేట, మంథని ప్రాంతాలతో పాటు మహారాష్ట్రలోని చంద్రాపూర్, మధ్యప్రదేశ్‌లోని బస్తర్ ప్రాంతాలన్నీ నస్పూర్ సంస్థానంలో ఉండేవి. నస్పూర్ సంస్థాన కేంద్రంగా సాగిన పరిపాలన వ్యవస్థ గోనె వెంకట వంశీయులు తపాలపూర్, రాజంపేట, సిరొంచ, కరీంనగర్ జిల్లా మంథని, ప్రాంతాలను జమీందారీ వ్యవస్థను నడిపించారు. నస్పూర్ సంస్థానానికి చెందిన జీవీ శ్రీనివాసరావుకు నలుగురు కుమారులు. వారు నాలుగు జాగీర్లను పాలించేవారు.

రాజేశ్వర్‌రావుకు గుడిపేల్లి, పొన్నారం, మురళీమనోహర్‌రావుకు నస్పూర్, పితాంబర్‌రావుకు తపాలాపూర్, జీవీ సుధాకర్‌రావుకు రాజంపేట, ముత్యంపేట బాధ్యతలు నిర్వహించేవారు. ఇందారం, సిరొంచ ప్రాంతాలు ముత్యంరావు, శ్రీనివాసరావుల ఆధీనంలో ఉండేవి. నస్పూర్ సంస్థానాన్ని పరిపాలించిన గోనె వెంకటవంశీయులో జీవీ పితంబర్‌రావు, జీవీ సుధాకర్‌రావులు స్వాతంత్ర్యం అనంతరం రాజకీయాల్లో రంగ ప్రవేశం చేశారు.



సింగరేణిలో ఆమె

- అన్ని విభాగాల్లోనూ విధులు
- కారుణ్య నియామకాలతో పెరుగుతున్న మహిళలు
- ఉన్నత చదువులు చదివిన వారూ ఎక్కువే

శ్రీరాంపూర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బొగ్గుబాయి కొలువంటే గతంలో పురుషులే వెనుకడుగు వేసేవారు. బొగ్గు తవ్వకం శారీరక శ్రమతో కూడిన పని. అందునా వందల అడుగుల లోతులో పనిచేయడం మామూలు విషయం కాదు. అందుకే సింగరేణి కొలువులో చేరేందుకు వెనుకబడుగు వేసే వారు. మహిళలు బొగ్గుబాయిల వైపు కనిపించే వారే కాదు.

ప్రస్తుతం పరిస్థితులు మారిపోయాయి. డిగ్రీలు, బీటెక్, ఎంటెక్ చదివిన వారు సైతం సింగరేణి ఉద్యోగాలకు పోటీ పడుతున్నారు. దీంతో సింగరేణి సంస్థలో మహిళల సంఖ్య నానాటికి పెరుగుతోంది. పురుషులతో తామేమి తీసిపోమన్నట్లు పనుల్లో ముందుకు వెళ్తున్నారు. సంస్థ సైతం మహిళా ఉద్యోగులను ప్రోత్సహిస్తోంది. దీంతో వారి సంఖ్య ప్రతి నెల పెరుగుతూ పోతోంది.

మహిళలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ప్రజా ప్రతినిధులుగా, ఉద్యోగులుగా అన్ని రంగాల్లోనూ వారి శ్రమ శక్తి పెరుగుతోంది. గతంలో బొగ్గు గనుల్లో మహిళలు ఉండేవారు కాదు.

భూగర్భంలో దిగి పనులు చేయడానికి ఆనాటి చట్టాలు అనుమతించేవి కావు. కానీ నేడు పరిస్థితి మారింది. మహిళల భాగస్వామ్యం లేని రంగం లేదు. బొగ్గు రంగం కూడా దీనికి మినహాయింపు కాదు. 2018లో సింగరేణి సంస్థ కారుణ్య నియామకాల విధానంలో అవకాశం కల్పిస్తూ సర్క్యులర్ ఇచ్చింది. దీంతో సంస్థలో పనిచేసేందుకు చాలా మంది యువతులు, మహిళలు ముందుకు వస్తున్నారు. ఉన్నత చదువులు చదివిన వారు సైతం సింగరేణి కొలువుకు మొగ్గు చూపుతున్నారు.

అత్యంత ధైర్యంతో ముందుకు

సింగరేణిలో ప్రస్తుతం కారుణ్య నియామకాల ద్వారా ముందుగా "బదిలీ వర్కర్" ఉద్యోగాన్ని ఇస్తున్నారు. సర్వీస్‌లో 180 మస్టర్లు నిండిన తరువాత "జనరల్ మజ్దూర్" పదోన్నతి కల్పిస్తారు. ఇలా ఏళ్ల తరబడి కష్టపడితే వారి సీనియారిటీ, విద్యార్హతను బట్టి పదోన్నతులు వస్తాయి. ఈ విషయాలన్నీ తెలిసే మహిళలు ఈ ఉద్యోగాన్ని ఎంచుకుంటున్నారు.

ఉన్నత విద్యావంతులు ఎందరో...

2018 తరువాత సింగరేణి సంస్థలో ఇప్పటి వరకు సుమారు 600లకు పైగా యువతులు ఉద్యోగాల్లో చేరారు. ఇందులో సింగరేణి వ్యాప్తంగా డిగ్రీ పాసైన వారు 250కి పైగా ఉండగా, బీటెక్ పూర్తి చేసిన వారు 60 మంది, ఎంటెక్ చేసిన వారు 11 మంది, ఇతర డిగ్రీలు చేసిన వారు చాలా మంది ఉన్నారు. ముందుగా ఉద్యోగంలో చేరి తరువాత తమ విద్యార్హతకు తగిన అంతర్గత పరీక్షలు రాసి పదోన్నతులు పొందుతున్నారు.

శ్రీరాంపూర్ ఏరియాలో...

శ్రీరాంపూర్ ఏరియాలో మహిళల సంఖ్య యేటా పెరుగుతోంది. కారుణ్య నియామకాల ద్వారా సంస్థలో చాలా మంది చేరుతున్నారు. 2018కి పూర్వం 59 మంది ఉండగా, 2018లోఒక్కరు, 2019లో 16 మంది, 2020లో ఏడుగురు, 2021లో 18 మంది, 2022లో 58 మంది, 2023లో 49 మంది, 2024లో ఇప్పటి వరకు 28 మంది చేరారు. ప్రస్తుతం 236 మంది ఏరియాలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్నట్లు సింగరేణి అధికారులు చెప్తున్నారు.



ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ చికిత్సలు పెంచాలి

మందమర్రి టౌన్/రూరల్ అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న వారికి డయాలసిస్ చికిత్సలు పెంచాలని వెంకటాపూర్ చెందిన సామాజిక వేత్త వెంకటేష్ సోమవారం జిల్లా వైద్యాధికారికి వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో చాలా మంది డయాలసిస్ సమస్యతో బాద పడుతున్నారని, డయాలసిస్‌కు సంబంధించి రోజుకు పది మందికి పైగా పేషంట్లను చూడాలని ఆయన కోరారు. కిడ్నీ సమస్యలపై డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. బాధితుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని వైద్య సదుపాయాలు పెంచాలని కోరారు.

నేడు కౌన్సెలింగ్

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 14(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2024లో జిల్లాలో ఉపాధ్యాయులుగా నియామక ఉత్తర్వులు అందుకున్న అభ్యర్థులకు మంగళవారం పాఠశాల పోస్టింగ్‌కు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈవోఎస్. యాదయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఉదయం 10 గంటలకు డీఈవో కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు.

అవార్డు అందుకున్న డాక్టర్



మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రైమ్ టైమ్స్ నిర్వహించిన గ్లోబల్ హెల్త్ కేర్ అవార్డు 2024 ఫర్ ఎక్సలెన్స్ ఇన్ ఆర్థోపెడిక్ ట్రామా అండ్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీ ఫ్రమ్ తెలంగాణ అవార్డు ను మంచిర్యాలకు చెందిన ఆర్థోపెడిక్ డాక్టర్ శ్రీనివాస్ యెగ్గన అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్ పార్క్ హోటల్‌లో ప్రముఖ క్రికెటర్ సునీల్ గవాస్కర్ చేతుల మీదుగా స్వీకరించారు. తక్కువ ఖర్చుతో ఆధునిక శస్త్ర చికిత్సలు అందించినందుకు ఆయనకు అవార్డు వచ్చింది.

మళ్లీ 'రెవెన్యూ' యోగం

(5వ పేజీ తరువాయి)

కాలాన్ని కోల్పోవలసి వచ్చింది. ఇదిలా ఉండగా నిరక్షరాస్యులతోపాటు వయస్సు పైబడిన వారిని మాత్రం రెవెన్యూ శాఖలోనే కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది.

పదోన్నతులకు దూరం

వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థ రద్దు కావడంతో ఆయా విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులను ఇతర శాఖల్లోకి సర్దుబాటు చేయగా జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్ హోదాల్లో ఆయా శాఖల్లో విధులు నిర్వహిస్తున్నారు. శాఖల బదలాయింపుతో అప్పటికే తమ సీనియారిటీ పోయిందన్న ఆందోళనలో ఉన్న వీఆర్వో, వీఆర్ఏలకు మళ్లీ పాత పోస్టింగ్ సంకేతాలు వెలువడుతుండటంతో ఆందోళన రేకెత్తుతోంది. ఇప్పటికే సీనియారిటీ పోయిందని ఆవేదన చెందుతుండగా, వెనక్కి పంపితే సర్వీసు నిబంధనలు ఎలా ఉంటాయోననే దిగులు వారిలో కనిపిస్తోంది. ఇదిలా ఉండగా రెవెన్యూశాఖలో అనేక సంవత్సరాలు పని చేసినప్పటికీ వారందరూ ఆయా శాఖల్లో జీరో సర్వీసు నుంచి ఉద్యోగ ప్రస్థానం మొదలుపెట్టారు. రెండేళ్ల ప్రొహిబిషన్ కాల వ్యవధి తర్వాత ఇటీవలే వారి రెగ్యులరైజేషన్ మొదలైంది. దీంతో పదిహేను, పదహారు ఏళ్ల నుంచి చేసిన సర్వీసు అంతా వృథా అయిపోయింది. కొద్ది రోజుల్లో వీఆర్వో నుంచి సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతులు పొందే సమయంలో గత ప్రభుత్వం వీఆర్వో, వీఆర్ వ్యవస్థను రద్దు చేయడంతో అర్హత ఉన్న వారంతా సర్వీసులను కోల్పోయి పదోన్నతులకు దూరమయ్యారు.

మంత్రి వ్యాఖ్యలతో ఆందోళన....

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థ పునరుద్ధరణపై రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలతో వీఆర్వోలు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. వీఆర్వో, వీఆర్ఏల నియామకాలకు సంబంధించి అభ్యర్థుల సామర్థ్యాలను తెలుసుకోవడానికి పరీక్ష నిర్వహిస్తామని, రెవెన్యూ సర్వీసులోకి రావాలంటే పరీక్ష రాయాల్సిందేనని స్పష్టం చేయడంతో ఇప్పటి వరకు నూతన ఉత్తేజంతో ఉన్న వీఆర్వోలు ఆందోళనకు గురవుతున్నారు. చాలా కాలంగా రెవెన్యూ వ్యవస్థలో పనిచేసినందున తమను మళ్లీ వెనక్కు తీసుకుంటే ప్రభుత్వానికే మేలు జరుగుతుందనే అభిప్రాయంలో వీఆర్వోలు ఉన్నారు. ఇంతకాలం పనిచేసిన అనుభవం ఉండగా, కొత్తగా పరీక్ష పేరుతో తమను రెవెన్యూశాఖకు దూరం చేయాలనుకుంటే ప్రభుత్వానికే నష్టం జరుగుతుందనేది వారి భావన.

ఆంధ్రజ్యోతి
కుమరం భీం
మంగళవారం 15 అక్టోబరు 2024

ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి: కలెక్టర్


ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను అధికారులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపుకలెక్టర్ దీపక్ తివారి, దాసరివేణుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సిర్పూర్(టి)మండలం పారిగాం గ్రామానికి చెందిన ఆనందరావు తాను రోడ్డు గ్రావెలింగ్, లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేశానని, సంబంధిత బిల్లులు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన రాహుల్ కుమార్ తాను టీ-హబ్‌లో ఫార్మసిస్టుగా పనిచేసిన కాలానికివేతనం ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన రాయమల్లు తాను డీఎస్సీలో ర్యాంకువచ్చి, ధ్రువపత్రాల పరిశీలన పూర్తైనా తనకు ఉద్యోగం రాలేదని న్యాయంచేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. రెబ్బెన మండల కేంద్రానికిచెందిన కృష్ణచంగ్ అగర్వాల్ తనకు గంగాపూర్‌శివారులో పట్టాభూమి విక్రయించగా మిగిలినభూమికి హద్దులు నిర్ధారించి ఇవ్వాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన కార్తికిరణ్ తనకు డీఎస్సీలో ర్యాంకు వచ్చినా ఉద్యోగం రాకపోవడానికిగల కారణాలు తెలియజేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాలజిల్లా కాసిపేటమండలం ముత్యంపల్లి గ్రామానికిచెందిన శ్రీనివాస్ ఐటీఐ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాగజ్‌నగర్ పట్టణంలోని పోచమ్మబస్తీకిచెందిన పారిజాతం తనకు వితంతుపెన్షన్ ఇప్పించాలని దరఖాస్తు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇప్పటివరకు జరిగిన ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పురోగతిపై శాఖలవారీగా సమీక్షించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు

కాగజ్‌నగర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లా తెలిపారు. సోమవారం కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. స్థానిక లారీఅసోసియేషన్ అధ్యక్షుడు కిషోర్‌బాబు ఆధ్వర్యంలో ఎస్పీఎం యాజమాన్యం మొండివైఖరిని వివరిస్తూ ఫిర్యాదు చేశారు. అలాగే పలు భూముల సమస్యను కూడా పరిష్కరించాలని పలువురు సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సిర్పూరు నియోజకవర్గంలో వివిధ మండలాల నుంచి 22 దరఖాస్తులు వచ్చాయి.


సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కిషోర్ బాబు



శౌచాలయాలు నిర్మించేదెప్పుడో?

ఒంటికీ, రెంటికీ కష్టాలు.. చెప్పుకోలేని బాధ

- ఎప్పుడు తీరేనో వ్యథ
- మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక అవస్థలు

ఆసిఫాబాద్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంగా ఏర్పాటు కావడంతో పట్టణం రోజురోజుకు విస్తారిస్తోంది. జిల్లాకేంద్రానికి ఆయా మండలాల నుంచి నిత్యం ఏదో పనిపై ప్రజలు వస్తుంటారు. పట్టణంలో ఎక్కడా ప్రజామరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో ప్రజలు ఒంటికీ, రెంటికీ తీవ్రఅవస్థలు పడుతున్నారు. ఎక్కడ కాస్తంత ఖాళీ స్థలం ఉన్నా మగవారు తమ సమస్యను తీర్చుకుంటున్నారు. ఆడవారి విషయంలో ఇది తీవ్రసమస్యగా మారుతోంది. జిల్లా కేంద్రం ఏర్పాటు ఆయిన నేపథ్యంలో పట్టణంలోని ఏదేని ఒక చోట శౌచాలయాల నిర్మాణాలపై అధికారులు దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు. ఇంటి నుంచి బయటకు వచ్చే మగవారైనా, ఆడవారైన రోజులో ఏదో ఒక సమయంలో ఆ సమస్య తీర్చుకోక తప్పదు. జిల్లా కేంద్రం కాబట్టి వివిధ కార్యాలయాలకు పనిపై ప్రయాణల కోసం విద్యాసంస్థలకు, బ్యాంకుల పనిపై, వ్యవసాయ, వ్యాపార నిమిత్తం, పంట ఉత్పత్తుల అమ్మకాలు, ఇంటి సామాన్లు కొనుగోలు ఇలా నిత్యం పనుల కోసం వేల సంఖ్యంలో ప్రజలు వస్తుంటారు. పట్టణంలోని దుకాణాలు, తోపుడు బండ్లు, చిరు వ్యాపారులు రోడ్లపై దుకాణాలు ఏర్పాటు చేసుకుంటారు. కనీస అవసరమైన శౌచాలయాల నిర్మాణంలో అటు పాలకులు, ఇటు అధికారులు దృష్టి పెట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. గతంలో పలువురు ప్రజాసంఘాల నాయకులు, పట్టణ ప్రజలు శౌచాలయాలు నిర్మించాలని సమస్యను లేవనెత్తినా, అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినా నేటికీ మోక్షం కలుగడంలేదు.

ఖాళీ స్థలాలు,ఆర్టీసీ బస్టాండే దిక్కు..

జిల్లా కేంద్రానికి వచ్చిపోయో ప్రజలతోపాటు వ్యాపారులు, వ్యాపార సముదాయాలలో పని చేసే మగవారు, ఆడవారు మూత్ర విసర్జనకు అవస్థలు పడుతున్నారు. ప్రత్యమ్నాయం లేక చాలా మంది ఆర్టీసీ బస్టాండు వైపు పరుగులు తీస్తున్నారు.దిక్కులేని పరిస్థితిలో పురుషులు పట్టణంలోని ఖాళీస్థలాల్లో మూత్ర విసర్జన చేయడంతో ఖాళీ స్థలాలు కంపుకొడుతూ అపరిశుభ్రంగా మారి, దుర్వాసన వెదజల్లుతోంది. కానీ మహిళలు మాత్రం పడారాని పాట్లు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా గ్రామల్లో ఇంటింటికి శౌచాలయాలు నిర్మించుకోవాలని, ఆరుబయట మల,మూత్రవిసర్జన చేయకూడదని చెబుతున్నప్పటి కినీ జిల్లాకేంద్రంలో మాత్రం ప్రజామూత్రశాలలు,మరుగుదొడ్లు నిర్మించడంలో అలసత్వం ప్రదర్శిస్తోంది. జిల్లా కేంద్రంలో అంబేద్కర్‌చౌక్, గాంధీచౌక్, వివేకానందచౌక్,గుండి రోడ్డు, జన్కాపూర్, బాబాపూర్ ఎక్స్‌రోడ్డుల వద్ద ప్రజామూత్ర శాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసున్నారు.

శౌచాలయాలు నిర్మించాలి..
- దినకర్, సీపీఎం జిల్లా నాయకుడు



జిల్లా కేంద్రమైన ఆసిఫాబాద్‌లో ప్రజామూత్ర శాలలు,మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. శౌచాలయాలు నిర్మించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా నిర్మించడంలో అలసత్వం వహిస్తున్నారు. ప్రజలు పడుతున్న అవస్థలపై దృష్టిసారించి ప్రజా మూత్రశాలలు,మరుగుదొడ్లు నిర్మించాలి.

కరెంటు సమస్య పరిష్కరించాలని రైతుల రాస్తారోకో

కౌటాల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కరెంటు సమస్యను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలో రైతులు సోమవారం రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం రాత్రి పూట ఆరుగంటల కరెంటు ఇస్తోందన్నారు. అది కూడాలో ఓల్టేజీతో నాణ్యత లేకుండా సరఫరా చేయడంతో మోటార్లు కాలిపోతున్నాయని మండిపడ్డారు. విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అంతకుముందు సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించగా అధికారులు ఎవరూ రాకపోవడంతో గంట తరువాత మార్కెట్ ఏరియాలోని ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. గుండాయిపేట 33/11కేవీ విద్యుత్‌సబ్‌స్టేషన్ బూస్టర్ చెడిపోయి సంవత్సరం గడుస్తున్నా అధికారుల నిర్లక్ష్యం వల్ల సమస్య తలెత్తిందని, తమ సమస్య తీరేవరకు ధర్నావిరమించేది లేదన్నారు. విద్యుత్‌శాఖ అధికారులు డౌన్‌డౌన్, ఏఈని సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. మరికొంత మంది రైతులు మాట్లాడుతూ రాత్రిపూట పొలానికి వెళ్తే క్రిమికీటకాల బారిన పడుతున్నామన్నారు. లక్షల రూపాయలతో తమతో డీడీలు కట్టించిన అధికారులు ఇప్పుడు కరెంటు అడగితే సమాధానం చెప్పడం లేదన్నారు. వెంటనే తమసమస్యను పరిష్కరిం చాలని కోరారు. కార్యక్రమంలో తాటిపల్లి, మొగడ్‌దగడ్, గుడ్లబోరి, గుండాయిపేట, వీర్దండి, తుమ్మిడిహెట్టి, బాలెపల్లి గ్రామాల రైతులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


కౌటాల మండల కేంద్రంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న రైతులు